రేపటి నుంచి పదో జోనల్ లెవల్ స్పోర్ట్స్‌మీట్

పోటీలకు సిద్ధమైన మైదానం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 9: మెదక్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పదో జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జోన్‌లోని రాజన్న సిరిసిల్ల, మెదక్, కరీంనగర్ జిల్లాల్లోని 13 విద్యా సంస్థలకు చెందిన అండర్-14, 17, 19 విభాగాల నుంచి 1,105 మంది బాలికలు పాల్గొననున్నట్లు తెలిపారు. వీరికి వాలీబాల్, ఖోఖో, టెన్నికోట్, చెస్, డిస్కస్ త్రో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల కోసం 26 మంది వ్యాయమ ఉపాధ్యాయులు, 56 మంది ఎస్కార్ట్ టీచర్స్, 13 మంది ప్రిన్సిపాళ్లు, ఒక్కో జోన్ నుంచి ఒక జోనల్ అధికారి వస్తారన్నారు.

అన్ని రకాల ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలి

టేక్మాల్, నవంబర్ 9: ఎన్నికల సమయంలో వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసగించిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్దిరాములు పేర్కొన్నారు. శనివారం టేక్మాల్‌లో ఆయన మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి ఇస్తామనడం, అందులోనూ కొన్ని రకాల ధాన్యానికే అంటూ రైతులను మోసం చేయడంతో కాంగ్రెస్ నైజం బయటపడిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట, నవంబర్ 9: నేడు చిన్నశంకరంపేటలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ జీవన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్నశంకరంపేట, పారిశ్రామికవాడ, రుద్రారం, కామారం గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 9: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదన్నారు.

రహదారులపై వడ్లు ఆరబెట్టొద్దు: ఎస్సై

పెద్దశంకరంపేటలో రైతులతో మాట్లాడుతున్న పేట ఎస్ఐ శంకర్

పెద్దశంకరంపేట, నవంబర్ 9: ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టవద్దని ఎస్సై శంకర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ఉత్తులూర్ గ్రామంలో రహదారిపై వడ్లు ఆరబెట్టడంతో సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏఎస్సై సునీత, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

SCRAP FOR SALE

★Tenders are invited from the Parties who are granted Registration by Pollution Control Board for lifting the Scrap (Cut Belts, Nitrile Flash, Polyester Cord, Scorched Compound, Damaged Oil Seals, Moulded Rubber Products, MS Plastic Barrels, Plastic Carbouys, Polythene Waste, Oil, MS Scrap, Wood, Kachara Scrap & Other Misc.) on Daily basis. Interested Parties may Contact the under signed for inspection. Last Date of submission 15-11-2024. Contact: Manager (Materials), J.K. Fenner (India) Limited, 4 & 22, IDA, Phase IV, Patancheru-502 319, Phone: 08455242636, 9908153792.
NT-336744

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్

కొల్చారం: తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి: నాగసానిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

- రేవంత్ పాలనలో రియల్ ఎస్టేట్ ధమాల్
- కేసీఆర్ హయాంలో భూములకు రెక్కలు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

కొల్చారం, నవంబర్ 9: కేసీఆర్ వచ్చాక తెలంగాణలో భూముల విలువ ఎకరాకు రూ.30, 40 లక్షలు పలికితే, ఇప్పుడు కొనే దిక్కులేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండలంలోని చిన్నఘనపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి హరీశ్‌రావు తెలంగాణ తల్లి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు పాలన వదిలేసి గాలిమోటార్లలో తిరుగుతున్నారన్నారు. రేవంత్ ఉద్యమకాలంలో ఆంధ్రాబాబులకు సంచులు మోశాడని, ఇప్పుడు ఢిల్లీకి మోస్తున్నాడని అన్నారు. కేసీఆర్ తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడారన్నారు. కేసీఆర్ సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడితే రేవంత్ తీసేస్తానంటున్నాడన్నారు. రాహుల్ తండ్రి విగ్రహం పెట్టాడు కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ జై తెలంగాణ పదమే ఉచ్చరిస్తలేరన్నారు. తెలంగాణ తల్లి దీవెనలతోనే రాష్ట్రం వచ్చిందన్నారు. తల్లిని గౌరవించని వాడు పశువుతో సమానమన్నాడు. ఆనాడు తెలంగాణ ఉద్యమకారుల మీద గురి పెట్టిన వాడు రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ కరోనా సమయంలో కూడా ధాన్యం కొనుగోలు చేసిందని, ఇప్పుడు వడ్లు కొనే దిక్కులేదన్నారు. ఎన్నికల ముందు అలవిగాని హామీలతో గద్దెనెక్కి ఒడ్డు చేరిందాక ఓడమల్లన్న, గట్టెక్కినంక బోడ మల్లన్న అన్న చందంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంజులా కాశినాథ్, మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, యువత అధ్యక్షుడు సంతోష్ రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేమారెడ్డి, అరిగె రమేశ్, కె.రాజాగౌడ్, కె.యాదాగౌడ్, ముత్యం ప్రవీణ్, రవితేజరెడ్డి, వై.కృష్ణ, చెన్నయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

కౌడిపల్లి, నవంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచి వడ్ల కొనుగోలును పట్టించుకోక వారి ఉసురుపోసుకుంటున్నదని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని నాగసానిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు నాగమణి, జోగయ్య, కృష్ణతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం బాగుండే.. ఆరు నెలలకు ఒక సారి రైతుబంధు వచ్చేది, సకాలంలో వడ్లు కొనేది, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా రూ.15వేలు ఇవ్వకుండా మోసం చేసిందని వారు మంత్రితో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా, పంట రుణమాఫీ చేయక, వడ్లు కొనక మోసం చేసిందన్నారు. వడ్లుకొనే ముఖం లేక హైదరాబాద్‌లో కూర్చొని సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని నడిపే సోయి లేక అడ్డదిడ్డమైన బూతులు మాటాతూ అక్రమ కేసులు పెడుతూ ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. సెంటర్ నిర్వాహకులు సంచికి 2 1/2 కిలోలు ధాన్యం తీసుకుని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారన్నారు. సెంటర్‌కు వడ్లను తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటాలు వేస్తాలేరని, రోజుకు 250 చొప్పున టాపర్లకు కిరాయి కడుతున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన మంత్రి నిర్వాహకులకు ఫోన్ చేయగా అందరికీ సరిపడా టాపర్లను తొందరలో ఇస్తామన్నారు.

కొల్చారానికి తరలిన గులాబీదండు

శివ్వంపేట, నవంబర్ 8: రైతులకు రుణమాఫీ అమలు, రైతు భరోసా అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కొల్చారంలో నిర్వహించిన రైతుదీక్షకు శనివారం గులాబీదండు భారీగా తరలివెళ్లారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ ఆధ్వర్యంలో శివ్వంపేట మండలంలోని అన్ని గ్రామాలు, తండాల నుంచి గులాబీ శ్రేణులు భారీగా వెళ్లారు.

శివ్వంపేట నుంచి తరలుతున్న గులాబీ శ్రేణులు

పకడ్బందీగా సమగ్ర సర్వే నిర్వహించాలి

- జిల్లాలో హౌస్ లిస్టింగ్ 100 శాతం పూర్తి చేయాలి
- ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణలో భాగంగా అదనపు కలెక్టర్ నగేశ్, సీపీవో, డీపీవో, మున్సిపల్ కమిషనర్, బీసీ, ఎస్సీ పంచాయతీ రాజ్, డీఆర్డీవో, మండల, మున్సిపల్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే కోసం జారీ చేసిన బుక్‌లెట్‌లో మొత్తం 56 అంశాలున్నాయని, ఎలాంటి సందేహాలకు తావులేకుండా ప్రజల నుంచి సమాచారం సేకరించాలని సూచించారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా ఇంకా మిగిలి ఉన్న తాళాలు వేసిన ఇంటి యజమానులకు సమాచారం అందించి, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలన్నారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్, మండల అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. హవేళీఘనపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో స్పెషల్ క్యాంపింగ్ డేను కలెక్టర్ పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శని, ఆది వారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీ 2025 నాటికి 18 ఏండ్లు నిండే యువత, కొత్త ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు, మార్పుల సవరణకు, అభ్యంతరాల తెలిపేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తమ బూత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో voters.eci.gov.in వెబ్‌సైడ్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

గోమాతకు ఘనంగా పూజలు

చిన్నశంకరంపేట, నవంబర్ 9: చందంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అగ్రహారంలో ఉన్న హనుమాన్ మందిరంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం గోమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నీలశ్యామ్, జిల్లా ప్రముఖ దూడ రవీందర్, బజరంగ్ దళ్ ప్రముఖ్ విశ్వనాథ్, సతీశ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దశంకరంపేట చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, నవంబర్ 9: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చౌదరి చెరువులో 38 వేల చేప పిల్లలు వదిలారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, మధు, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు. అనంతరం జూకల్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

మత్స్యకారులు ఆర్థికంగా వృద్ధి చెందాలి

అల్లాదుర్గం, నవంబర్ 9: మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ శేషారెడ్డి అన్నారు. అల్లాదుర్గంలోని పటేల్‌చెరువులో శనివారం చేప పిల్లలు వదిలారు. మత్స్యకారులు చేపల పెంపకంతో ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు రామకిష్టయ్య, డైరెక్టర్లు అంజయ్య, అక్షయ్, మండల అధ్యక్షుడు భూమయ్య, సభ్యులు నర్సింహులు, యాదయ్య, లక్ష్మయ్య, రాములు, వెంకటేశం పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

రామాయంపేట, నవంబర్ 9: పశువులకు ముందస్తుగా గాలికుంటు, గర్భ నిర్ధారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యులు శ్రీనివాస్, రాజు తెలిపారు. శనివారం మండలంలోని పర్వతాపూర్, కాట్రియాల గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

రామాయంపేట, నవంబర్ 9: దామరచెర్వు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి సత్తూరి నిఖిత ఎంఈవో అయిత శ్రీనివాస్ ద్వారా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను శనివారం అందజేశారు.

బాధితునికి సెల్‌ఫోన్ అప్పగింత

నిజాంపేట, నవంబర్ 9: నస్కల్ గ్రామానికి చెందిన ఆకుల రమేశ్‌గౌడ్ కొన్ని రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ వెతికి ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి శనివారం అందజేశారు.

బాధిత కుటుంబానికి అల్లం నారాయణ పరామర్శ

చేగుంట, నవంబర్ 9: బాధిత కుటుంబాన్ని తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పరామర్శించారు. అమీన్‌పూర్ సీనియర్ జర్నలిస్టు చేగుంట మండలం కర్నాల్‌పల్లికి చెందిన జనగామ రాములుగౌడ్ అత్తమ్మ దుండిగల్‌లో మృతి చెందింది. విషయం తెలుసుకున్న శనివారం అల్లం నారాయణ పరామర్శించారు. ఆయన వెంట పలువురు సీనియర్ జర్నలిస్టులు, చేగుంట మాజీ ఎంఎసీ చైర్మన్ రజనక్ ప్రవీన్‌కుమార్, మక్కరాజిపేట ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ సుధాకర్‌గౌడ్ తదితరులున్నారు.

మాలల మహా పాదయాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ

మాలల మహా పాదయాత్ర గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేగుంట, నవంబర్ 9: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా, దళితుల ఐక్యత కోసం ఈ నెల 25 నుంచి భద్రాచలం నుంచి మాలల మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు మాలల రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకల శ్రీరాములు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర జిల్లాకు 23 చేరుకుని, 24న రామాయంపేట నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన గోడ ప్రతికను ఎగ్గడి శేఖర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సమావేశంలో కల్లూరు సంజీవ, దుబాసి సంజీవ్, బండారు చంద్రయ్య, బైరం సిద్దిరాములు, బాబురావు, ఊరట్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి

టేక్మాల్, నవంబర్ 9: ఈ కుబేర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే బిల్లులు చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం టేక్మాల్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరి, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, నవంబర్ 9: మనస్తాపం చెంది ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుషన్ గడ్డ తండాలో శనివారం చోటుచేసుకున్నది. కౌడిపల్లి ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడావత్ లాలు (48) గ్రామ శివారులోని కుబాంకరి వృద్ధ గోశాలలో రెండేండ్లుగా పని చేస్తున్నాడు. పనిలో నుంచి అనుకోకుండా అతన్ని తీసివేశారు. ఇదే విషయమై కుటుంబ సభ్యులు అందరూ కలిసి గోశాల యజమానిని అడగగా ఎనిమిది రోజుల క్రితం పనిలో పెట్టుకున్నాడు. అప్పటి నుంచి గోశాల సూపర్‌వైజర్ వంజరి శ్రీనివాస్, యజమాని పదే పదే పని విషయంలో ఇద్దరు కలిసి తనను ఇబ్బంది పెడుతున్నారని కుటుంబ సభ్యులతో చెప్తూ బాధపడేవాడు. ఇదే క్రమం లో ఈనెల 8న రాత్రి 8 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఉదయం 9 గంటల వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా గోశాలలోని చెట్టుకు లాలు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. లాలు మరణంపై తమకు యజమానిపై అనుమానం ఉన్నదని, పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు.

వ్యవసాయంతోనే గ్రామాలాభివృద్ధి

రామానాయుడు విజ్ఞాన జ్యోతి వ్యవస్థాపకుడు సురేశ్‌బాబు

పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

కౌడిపల్లి, నవంబర్ 9: దేశం బాగుండాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలని రామానాయుడు విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ సురేశ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని తునికి రామానాయుడు విజ్ఞాన జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామాల్లో ఉండకుండా పట్టణాలకు వలసవెళ్లి అక్కడ విసుగు చెంది మళ్లీ తమ సొంత గ్రామాలకు చేరుకుని వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు తమ గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించి లాభసాటి వ్యవసాయానికి సూచనలు ఇస్తూ తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అర్జున్‌రావు, జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, అచ్యుతరాంప్రసాద్, డీఎన్.రావు, కెఎన్.రావు, డిప్యూటీ సీఈవో సంజయ్‌కుమార్, అరుణకుమారి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీల కొరతతో నిలిచిపోయిన ధాన్యం

లారీల కొరతతో టేక్మాల్ సొసైటీలో పేరుకుపోయిన ధాన్యం

టేక్మాల్, నవంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు తప్పడంలేదు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లారీల కొరతతో మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మిల్లులకు వెళ్లడంలేదు. దీంతో ధాన్యం నిల్వలు భారీగా పేరుకుపోయాయి. లారీలు రావడం లేదని, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనడం కూడా నిలిపేశారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం, నవంబర్ 9: ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే కానిస్టేబుల్ కొట్టి అవమానించడంతో రాంపూర్ గ్రామానికి చెందిన కిశోర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అందోల్ మాజీ ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా చేగుంట

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అయిత పరంజ్యోతి

చేగుంట, నవంబర్ 9: జాతీయ స్థాయి క్రీడలకు చేగుంట వేదికగా మారిందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి తెలిపారు. చేగుంటలోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ సెలక్షన్ క్రీడల ఎంపిక పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 16, 17, 18న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాను మొదటి స్థానంలో నిలుపాలని ఆయన కోరారు. కార్యక్రమంతో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, రాష్ట్ర యోగా కోచ్ కరణం గణేశ్‌కుమార్, పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు నాగరాజు, పీఈటీలు అల్లి నరేశ్, ఏ శంకర్, విష్ణు, డీ శంకర్, శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ స్థానంలో మానేపల్లి బాలికలు

ద్వితీయ స్థానంలో నిలిచిన బాలికలు, పీఈటీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి, నవంబర్ 9: జిల్లాస్థాయి వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో మానేపల్లి ప్రభుత్వ బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. పీఈటీ సంతోష్, హెచ్ఎం కౌసల్య, టీచర్లు అభినందించారు. అండర్-14 విభాగంలో విద్యార్థిని నందిని రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుంది

రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట, నవంబర్ 9: ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొంటుందని, రైతులు ఆందోళనకు గురికావద్దని తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శనివారం మండలంలోని గవ్వలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి

18ఏండ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. మండలంలోని చందంపేటలో ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపును సందర్శించారు.